# చూపులు

కొమ్మూరి వేణుగోపాలరావు



బయటంతా చలిచలిగా, చీకటిగా వుంది. వర్షం రాబోయే సూచనలు. మధ్య మధ్య ఓ మెరుపు.

హాల్లో కూడా చలిగా వుంది. అయినా ఫ్యాన్ తిరుగుతూనే వుంది. శీతాకాలంలో కూడా ఫ్రిజ్ వాటర్ త్రాగటం, ఎ.సి. రూమ్‌లో బ్లాంకెట్‌లో దూరి పడుకోటం — సోఫిస్టికేటెడ్ లైఫ్‌లో ఒక భాగం.

ఆ చలినుండి శరీరాలనూ, మనసులనూ వెచ్చపరుచుకునే తాపత్రయంలో వున్నారు వాళ్లు నలుగురూ.

లాయర్ పురుషోత్తం 'సమ్‌థింగ్ స్పెషల్'ను ఖరీదైన గ్లాసులలోకి పెగ్ మెజర్‌తో వొంపుతున్నాడు. ఈ రోజు పార్టీ అతనిదే. బర్త్‌డే పార్టీ. భార్య పుట్టింట్లో వుంది. తండ్రికి జబ్బుగా వుంటే చూడ్డానికి వెళ్ళింది.

కాంట్రాక్టరు జగన్నాథం, లాయరుగారి ముఖంలోని నిశ్చలత్వాన్నీ, కార్యదీక్షనూ ఆసక్తిగా చూస్తున్నాడు.

ఇంజనీరు కాంతారావు "ఆన్‌లుకర్" మేగజిన్ రెండు చేతులలో పట్టుకుని "ప్లే బోయ్ క్లబ్" గురించి బన్నీగర్ల్ కాటే మిర్జా రాసిన వ్యాసాన్ని చాలా యింటరెస్ట్‌గా చదువుతున్నాడు.

లైఫ్ యిన్స్యూరెన్స్ ఏజంట్ మోహనరావు పేముకుర్చీలో వెనక్కివాలి కూర్చుని "త్రీ ఫైవ్స్" ఆనందం మౌనంగా అనుభవిస్తున్నాడు.

నలుగురూ మిడిల్ ఏజ్‌కి దగ్గరగా జరుగుతున్నారు. జీవితంలోకి దూసుకువస్తున్నారు. లాయర్ పురుషోత్తం బొద్దుగా, నిండుగా వుంటాడు. ఇప్పుడిప్పుడే బట్టతల పడుతోంది. కాంట్రాక్టర్ జగన్నాథానిది భారీ విగ్రహం. వొత్తైనజుట్టు చెంపలదగ్గర నెరుస్తోంటే జుట్టుకు రంగేసుకోటం నిరుటినుంచీ మొదలుపెట్టాడు. ఇంజనీర్ కాంతారావు జిందా తిలిస్మాత్ ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లో యోధుడిలానూ,నలుపుగానూ వుంటాడు. ఇన్స్యూరెన్స్ ఏజంటు మోహనరావు పచ్చని పసిమి. పొడవుగా, నాజూగ్గా వుంటాడు. అతని జుట్టు పలచబడనూ లేదు, రంగేసుకోకుండానే నల్లగా నిగనిగలాడుతూ వుంటుంది. కళ్ళెప్పుడూ చురుగ్గా అటూ యిటూ కదులుతూ వుంటాయి.

విస్కీ గ్లాసులలో పొయ్యటం పూర్తయింది. గురువులు ఫ్రిజ్‌లోంచి బిస్‌లరీ సోడాలు తీసుకొచ్చి ఓపెన్‌చేసి టేబిల్ మీద పెట్టాడు. పురుషోత్తం ఒకటొకటిగా సోడాలతో గ్లాసులు నింపాడు.

కాంతారావు వ్యాసం పూర్తిచేసి తృప్తిగా నిట్టూర్చి పుస్తకం ప్రక్కన పెట్టాడు.

నలుగురూ గ్లాసులు చేతులలోకి తీసుకున్నారు.

"ఛీర్స్."

"మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే."

కొంచెం సిప్ చేశారు.

గురువులు ప్లేట్లలో జీడిపప్పు, పొటేటో చిప్స్ సర్దాడు.

"ఇప్పుడు చెప్పు" అన్నాడు పురుషోత్తం మోహనరావుతో.

"ఏమిటి ?"

"లింగరాజు గురించి."

జగన్నాథం చప్పరించాడు "ఏముంది లింగరాజు గురించి. మందు త్రాగడు. సినిమాలు పెళ్ళాంతో మాత్రమే చూస్తాడు. ఎవరితోనూ ఎక్కువగా కలవడు. వేళపట్టున యింటికి వెళ్ళటంలో సాటిలేనివాడు. అమ్మాయిల గురించి మాట్లాడనే మాట్లాడడు" అన్నాడు వేళాకోళంగా.

"యివేమీ కాకుండా యింకా అతన్లో విశేషాలున్నాయి" అన్నాడు మోహనరావు విస్కీ కొంచెం చప్పరించి.

"అవి నేను చెబుతాను. ప్రపంచానికి అక్కరకు రాని ప్రపంచ జ్ఞానం అతనికి చాలా వుంది. వాటర్లూ యుద్ధం ఎక్కడ, ఎప్పుడు జరిగిందో, జిన్నా ఏ సంవత్సరంలో చచ్చిపోయాడో, రష్యాలో ఏ మంత్రికి ఏ పోర్టిఫోలియో వుందో, ప్రపంచంలో మొట్టమొదట కారు ఎప్పుడు ఎవరు కనిపెట్టారో— అవన్నీ క్షుణ్ణంగా చెప్పగలడు" అన్నాడు కాంతారావు వెటకారంగా.

"యివేకాదు యింకా విశేషాలున్నాయి" అన్నాడు మళ్ళీ మోహనరావు.

"అదే చెప్పు" అన్నాడు పురుషోత్తం.

"చెప్పబోయేది రసాత్మకంగా వుంటుందా ? లింగరాజు చాలా పొడి మనిషి. ఏదో సోద చెప్పి యీనాటి పార్టీలోని మజా పాడుచెయ్యవు కదా" అని జగన్నాథం అనుమానం వెలిబుచ్చాడు.

"ఆ భయమేం వద్దు. మీకు వీనులకు విందూ కలిగిస్తుంది, రసభరితంగానూ వుంటుంది" అని మోహనరావు యీసారి కొంచెం ఎక్కువ విస్కీని సిప్ చేశాడు.

శరీరాలలో కొద్దిగా ప్రకంపన మొదలయింది. నరాలు జివ్వు జివ్వు మనటమూ సాగింది. మధ్య మధ్య మంచింగ్. బయట వాన ఎక్కువైన శబ్దం తెలుస్తోంది.

"లింగరాజు మా షాపుకు ప్రతి సాయంత్రమూ అతని ఆఫీసు వొదిలేక వచ్చేవాడని మీకు తెలుసుకదూ..."

ఫోన్ మ్రోగింది.

"మొదలు" అని జగన్నాథం విసుక్కున్నాడు.

పురుషోత్తం వెళ్ళి రిసీవర్ అందుకున్నాడు.

"హలో...డార్లింగ్ నేనే. ప్రొద్దుటి నుంచీ ట్రై చేస్తున్నావా ? లైన్ దొరకటం లేదా ? థ్యాంక్యూ ఫర్ యువర్ గ్రీటింగ్స్ ... త్వరగా వచ్చెయ్యి ... విరహంతో చచ్చిపోతున్నాను ... మీ నాన్నగారికి తగ్గిందా...? వెరీగుడ్... ఉంటాను."

"మా శ్రీమతి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పటానికి ప్రొద్దుటినుంచీ ప్రయత్నిస్తోందట" అన్నాడు మళ్ళీ కూర్చుని గ్లాసు చేతిలోకి తీసుకుంటూ.


"ఇప్పుడేం చేస్తున్నావని అడగలేదా ?" అన్నాడు కాంతారావు చిలిపిగా.

"మా ఆవిడకి తెలుసు..." పురుషోత్తం గర్వంగా జవాబిచ్చాడు.

"సరే. కథ కానియ్యి."

మోహనరావు త్రీ ఫైవ్స్ ఆఖరి దమ్ములాగి యాష్‌ట్రేలో పడేశాడు.

"నేను ఆఫీసు ఫైల్స్ ముందేసుకుని ఏ పాలసీహోల్డరు యీసారి ప్రీమియం కట్టలేదో, ఎవరి పాలసీ లాప్స్ అయేలా వుందో, ఎవరికి రిమైండర్స్ రాయాలో అన్నీ చూసుకుంటూ వుండగా లింగరాజు మౌనంగా కూర్చుని, పేపరు యీవినింగ్ ఎడిషన్ వస్తే కాసేపు తిరగేసి, మధ్య మధ్య నే నేదైనా




పలకరిస్తే క్లుప్తంగా జవాబులుచెప్పి చీకటి పడే వేళకి యింటికి వెళ్ళిపోయేవాడు.

"అలాంటిది లింగరాజు ధోరణిలో వున్నట్లుండి మార్పొచ్చింది.

"ఎదురుగా కూర్చుని పేపరు తిరగేసే మనిషి, లేక బయట గుమాస్తాలతో వీలున్నప్పుడు రాజకీయాలు మాట్లాడే మనిషి, అసలు లోపలకు రాకుండా, వీధిద్వారం మెట్లమీదే నిలబడిపోయి వుండటం మొదలుపెట్టాడు.

"మొదట్లో యీ మార్పు నేను పట్టించుకోలేదు. కాని ప్రతిరోజూ అతను మెట్లమీద అదే స్పాట్‌లో నిలబడటం, యెటో దీక్షగా చూస్తూడటం నాలో ఆసక్తిని రేకెత్తించింది.

"వెళ్ళిపోయేముందు లోపలకు వచ్చేవాడు. మనిషి మామూలుగానే వుండేవాడు. తేడా ఏమీ కనిపించేది కాదు."

అయితే అతని ధోరణిలో మాత్రం నిస్సందేహంగా మార్పు వచ్చింది.

"ఏమిటది...?

"ఎన్నోసార్లు కుతూహలంగా లోపల నుండి చాటుగా గమనించాను."

అక్కడే — అదే స్పాట్‌లో నిలబడతాడు. అటూ యిటూ బెసగడు. మధ్య మధ్య కళ్ళలో ఏదో చురుకు, తొందర ... ఎవరి వేపలా తినేసేటట్లు చూస్తాడు ... అంత అద్భుతంగా ఏమిటతన్ని ఆకర్షిస్తోంది? రోజులు, వారాలు గడిచినా తన కార్యక్రమంలో మార్పు రాదేమిటి ? పైపెచ్చు యిదివరకు మధ్య మధ్య పనివుండి యిక్కడికి రావటం ఎగ్గొట్టేవాడు. ఇప్పుడు తప్పనిసరిగా ఎటెండెన్స్ వేయించుకుని తీరుతున్నాడు. ఒకవేళ...ఒకవేళ ప్రేమలో పడ్డాడా ?"

మొదటి పెగ్గు పూర్తయింది. అంతా మూడ్‌లోకి వచ్చేశారు. హుషారొచ్చేసింది.

"లింగరాజు ప్రేమ కథ కిక్కిస్తోంది..." అన్నాడు జగన్నాథం.

పురుషోత్తం మళ్ళీ అన్ని గ్లాసులలో విస్కీ పంచాడు. సోడాలు అందించాక గురువులు కూడా కథ వినటంకోసం అక్కడే నిలబడ్డాడు. అతనక్కడ నిలబడి వుండటం కాంతారావుకు యిబ్బందిగా వుంది గాని, ఏమీ అనలేక వూరుకున్నాడు.

మోహనరావు మళ్ళీ మొదలు పెట్టాడు.

"ఒకరోజు—జ్వరంగావుండి కాబోలు లింగరాజు రాలేదు.

"ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, నేను బయట కెళ్ళి అతను రోజూ నిలబడే స్పాట్‌లో నిలబడ్డాను.

"చుట్టూ గమనిస్తున్నాను.

"ఎదురుగా చిట్టిగారెలు చేసే బడ్డీ వుంది. ఆ చిట్టిగారెల ఘుమఘుమ నలువైపులా వ్యాపించి, నలుగుర్నీ అటువైపు ఆకట్టుకుంటోంది. అయితే చిట్టిగారెల ఘుమఘుమకన్నా అవి నూనెలో వేయించే బడ్డీవాడి కూతురి ఘమకం కొట్టువైపు ఎక్కువగా ఆకట్టుకుంటోంది.

"ఆ అమ్మాయిలో ఆకర్షణ తక్కువేంలేదు. వయసు సింగారాలన్నీ అమరినట్లు, కళ్ళప్పగించి చూసేటట్లున్నాయి.

"ఈ అమ్మాయినా మనవాడు చూపులతో తినేస్తున్నాడు.

నేను నిల్చున్న స్థలంనుంచీ బడ్డీ కొట్టూ, ఆ అమ్మాయీ చక్కగా, స్పష్టంగా కనిపిస్తున్నారు. మధ్య మధ్య యీ మధ్య కొత్తగా వేసిన సిటీబస్ స్టాప్‌వల్ల, ఓ సిటీ బస్సు ఆగటం, బడ్డీకొట్టు కనబడకుండా అడ్డురావటం జరుగుతోంది."

"ఆ అమ్మాయిని నేనూ చూశాను. అక్కడ చిట్టిగారె లెంత బాగుంటాయో, ఆ పిల్లకూడా అంతే బాగుంటుంది" అన్నాడు జగన్నాథం. అతని మాట కొంచెం తడబడుతోంది. మిగతావారి కన్నా కొంచెం ముందుగా అతనికి కిక్కురావటం, అతడి సంప్రదాయం.

"వయస్సులోవున్న ఏ ఆడపిల్లయినా బాగానే వుంటుంది" అని కాంతారావు చిన్నగా గొణిగాడు.

గురువులకు కథ మంచి యింటరెస్టింగ్‌గా వుంది. మధ్య మధ్య వీళ్ళ సణుగుడు నచ్చలేదు. వీళ్ళీవేళ యిచ్చే బక్షీష్‌తో మరునాడు సాయంత్రం బడ్డీకొట్టుకెళ్ళి కనీసం రెండు రూపాయల చిట్టిగారెలు కొనేద్దామని ప్లాన్ వేసుకుంటున్నాడు.

ఆ పిల్లేనని నేను నిర్ధారణకు వచ్చేశాను. లింగరాజు రహస్యం కనుక్కున్నట్టుగా రిలీఫ్ ఫీలయ్యాను.

"కాని అలా అనుకున్న మరునాడే బడ్డీకొట్టు గోవిందయ్యా నా దగ్గర కొచ్చాడు.

"నమస్కారమయ్యా. మాఅమ్మాయి పెళ్ళి కుదిరింది. వచ్చేవారమే ముహూర్తం" అన్నాడు.

ఆ సమయానికి లింగరాజు లోపలకు వస్తున్నాడు.

"విన్నావా ? వీళ్ళమ్మాయి — అక్కడ నిల్చొని చిట్టిగారెలు వెయ్యదూ ? ఆ పిల్లకి పెళ్ళి కుదిరిందిట" అన్నాను అతని ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

నే ననుకున్నట్లు — అతన్లో ఏ మార్పూ కనబడలేదు.

"అయితే యీవాళ్టి నుంచీ మీ అమ్మాయి కొట్టుకు రాదన్నమాట" అన్నాను.

"ఎలా బాబూ ? ఇన్నాళ్ళూ అయితే నాకు సాయం చెయ్యటానికి వచ్చేది. అసలే పోకిరీ సమాజమయ్యె. ఈ నాలుగురోజులూ యింటిపట్టునే వుండమన్నాను. ఇహనుంచీ నా ఒక్కడికీ తిప్పలు తప్పదు. చేసేదేముంది ? వస్తానయ్యా" అని గోవిందయ్య వెళ్ళిపోయాడు.

రొటీన్ ప్రకారం లింగరాజు తన స్థానంలోకి వెళ్ళిపోయాడు.

"ఆ రోజు ఆ అమ్మాయి రాలేదని నాకు తెలుసు. అయినా అతని ప్రవర్తనలో, తినేసే చూపులలో ఏ మార్పూ లేదు.

నాకు ఉక్రోషం వచ్చింది. నేను ఓడిపోయా ననుకున్నాను. ఈ రహస్యం కనిపెట్టాలన్న పట్టుదల హెచ్చింది.

"అయితే బడ్డీకొట్టు అమ్మాయి కాదన్నమాట" అన్నాడు జగన్నాథం నిస్పృహగా.

" అన్న మా టే గా " అన్నాడు పురుషోత్తం.

కాదని తను ముందే వూహించినట్లు కాంతారావు నిబ్బరంగా కూర్చున్నాడు.

గురువులకు ఏడుపొచ్చినంత పన యింది. బక్షీష్ డబ్బులతో రాత్రికి రాత్రి వెళ్ళి బిషాలు కొట్లో రెండు రూపాయల నాటుసారా త్రాగేయాలనుకున్నాడు.

ఆ తర్వాత కూడా లింగరాజు కార్యక్రమంలో మార్పులేదు.


"ఒక రోజు—అతను రాలేదు..."

"ఆ రోజుకూడా జ్వరం వచ్చిందా?" అనడిగాడు జగన్నాథం.

"కాదు. వాళ్ళావిడతో సినిమాకు వెళ్ళాడు. ఆవేళ ఎలాగయినాసరే, అతని రహస్యం పసిగట్టివేయాలను కున్నాను. ఆఫీసుపని మూలకునెట్టి, అతను నిల్చొనే ప్రదేశంలోకి వెళ్ళి నిల్చున్నాను."

రోజూ సాయంత్రం ఆరూ, ఏడూ గంటల మధ్య చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేసే ఓ అమ్మాయి, ఆఫీసు పని ముగించుకుని ఆ దారిన వెడుతుంది. ఆవేళ కూడా ఆ అమ్మాయి అలాగే వెళ్ళింది. వెడుతూ, వెడుతూ నేను నిలబడ్డకేసి ఓరగా చూసి వెళ్ళిపోయింది. ఆమె చూపులలో నాకేదో వెంటాడిన తనం కనిపించింది. ఒకవేళ ... ఒక వేళ...ఆమేనా...? ఆమె వెళ్ళిపోయాక కూడా పట్టుదలగా అలాగే నిలబడ్డాను. చీకటిపడేదాకా వున్నాను. అంతకు మినహాయించి యింకేమీ విశేషం కనబడలేదు.

మరునాడు లింగరాజు వచ్చాడు. అదే ధోరణి. నాకు రహస్యం పసి గట్టేశా ననిపించింది. అతన్ని పిలిచి, నాలో అతను యిన్నాళ్ళూ రేపిన



కలవరపాటూ, దానికి నే పొందిన సొల్యూషనూ చెప్పేద్దా మనుకున్నాను..."

రెండో పెగ్గు కూడా పూర్తయింది.

అంతా ఆలోచనలలో వున్నట్టు, ఏవేవో దృశ్యాలు ఊహించుకుంటున్నట్టు కనిపించారు.

"ఐ వాంట్ ... ఐ వాంట్ సోడా..." జగన్నాథం తడబడుతున్నాడు.

"వెయిట్ గురువులూ! లోపల్నుంచి సోడాలు పట్రా" పురుషోత్తం అన్నాడు.

"మరీ లేటుఅయితే ఫుడ్ దొరకదు. గురువుల్ని వెళ్ళి పార్సిల్ తీసుకు రమ్మనండి," అన్నాడు కాంతారావు. అతనికి గురువులు అక్కడే నిలబడి, తమతోబాటు శ్రవణానందం పొందుతూ వుండటం దుస్సహంగా వుంది.

లోపల్నుంచి సోడాలు తీసుకు వస్తోన్న గురువులు యీ మాటలు విన్నాడు. అతనికి కథలో యింకా సస్పెన్స్ తేలలేదు. ఇందాక కలిగిన నిస్పృహ క్రమంగా అంతరించి, మళ్ళీ కొత్త ఉత్సాహం చోటుచేసుకుంటోంది. తర్వాత చాలా వ్యవహారం జరిగి వుంటుంది. చిట్‌ఫండ్ అమ్మాయి కథ తను ఆలకించి తీరాలి.

"బయట బాగా వర్షం పడుతోందయ్యగారూ. గొడుగు కూడా లేదు" అన్నాడు.

"అవును నిజమే. గొడుగు లేకుండా యింత వర్షంలో బయటకు పోవటం కష్టం." పురుషోత్తం ఒప్పుకుంటున్నట్టు అన్నాడు.

"మరి ఫుడ్..." అన్నాడు కాంతారావు అసహనంగా. అతను భోజన ప్రియుడు. అందులో మందు పుచ్చుకున్నప్పుడు విధిగా విరివిగా వుండాలి.

"ఎవరి కేమేమి కావాలో చెప్పండి. ఆ ఫోన్‌లో ఆర్డర్ చేస్తాను. యిక్కడికే తీసుకొస్తాడు."

అందరూ వాళ్ళ వాళ్ళ కోరికలు బయటపెట్టారు.

"నాకు ఛిల్లీ చికెన్."

"చికెన్ బిర్యాని."

"రైస్ కన్ననాన్ అయితే బాగుంటుంది. ఫ్రాన్స్ కర్రీ కూడా చెప్పండి."

"అలాగే ఛిల్లీ సాస్ కూడా తీసుకు రమ్మనండి. ఆ మాత్రం కారం తగలక పోతే బాగుండదు."

పురుషోత్తం ఫోన్‌లో అన్నీ ఆర్డర్ చేసి వచ్చాడు.

థర్డ్ రౌండ్ మొదలయింది.

"ఇహ చెప్పు" అన్నాడు జగన్నాథం.

అతనికి చిట్‌ఫండ్ అమ్మాయి తెలుసు. అతని దగ్గరకు తమ కంపెనీ స్కీమ్‌లో చేరమని ఒకసారి వచ్చింది. నాలుగయిదుసార్లు తిప్పించుకుని చివరకు 'సినిమాకి వస్తావా?' అని అడిగాడు. ముఖంమీదే నాలుగూ దులిపేసి వెళ్ళిపోయింది.

లింగరాజు ఊరికినే చూపులతోనే పోనిచ్చాడా? లేకపోతే వీరుడిలా ముందుకు నడిచి విజయం సాధించాడా? లేక పరాభవం పొందాడా? తెలుసుకోవాలని మహా తొందరగా వుంది. కాని బయటపడటం యిష్టంలేదు. ఎందుకంటే కాంతారావుకు ఆమె తనను దులిపేసిన సంగతి తెలుసు.

"కాని పరీక్షపెట్టినట్టు మరునాటి నుంచీ చిట్‌ఫండ్ అమ్మాయి అటుకేసి రావటం మానేసింది. నేను వాకబు చేయగా ఆమె యిల్లు మారినట్టు, కాబట్టి రూట్ కూడా మారినట్టు తెలిసింది.

"లింగరాజు అక్కడ నిల్చోటం మానేశాడా?" జగన్నాథం అసంతృప్తిగా అడిగాడు.

"లేదు. అతని కార్యక్రమం యధావిధిగా సాగిపోతోంది. నిలబడతాడు. ఎటో చూస్తాడు. తినేసేటట్టు, పెద్దపులిలా, ఎలాగో చూస్తాడు. నాలో రెస్ట్‌లెస్‌నెస్ ఎక్కువైపోతోంది. ఎందుకు నేను తెలుసుకోలేకపోతున్నాను? ఎందుకు అతను నాకు అర్థంకావటం లేదు! ఒకవేళ ఏమీ లేదా? నిజంగా... నిజంగా...ఏదో వుంది. అందులో సందేహం లేదు. కాని ఏమిటి? అతన్ని పిలిచి అడిగేద్దామా? సిల్లీగా వుంటుంది. పైగా చస్తే చెప్పడు. నాలో నేను చాలా మధనపడ్డాను.

"ఓసారి లింగరాజు ఊరెళ్ళి రెండు మూడు రోజులదాకా రాలేదు. అతని స్థానం నే నాక్రమించి దీక్షగా, శ్రద్ధగా గమనించాను.

"మా ఆఫీసు దగ్గర కొత్తగా బస్‌స్టాప్‌వేశారని చెప్పాను కదా. ఈ బస్సులలోంచి ఎవరో దిగుతూ వుండాలి. ఆలోచించగా యిక్కడ బస్‌స్టాప్ పడినప్పట్నుంచే అతనక్కడ నిల్చోటం ప్రారంభమయినట్టు స్ఫురించింది."

"ఎవరు దిగుతున్నారు ఆ బస్సులలోంచి?" చాలా జాగ్రత్తగా పరిశీలించాను.

"ఈ రెండు మూడు రోజులలోనూ కొంచెం కుడి ఎడమగా ఒకే టైములో దిగేవారు — ఓ కాలేజి అమ్మాయి, సూపర్‌బజారులో పనిచేసే వర్కింగ్ గర్ల్, ఎవరో తెలీదుగాని రెండు జడలు వేసుకుని ఎందుకో అక్కడ దిగే మరో అమ్మాయి నా దృష్టిని ఆకర్షించారు. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు అయి వుండాలి. ఎందుకంటే వాళ్ళందరిలోనూ మనిషిని ఆకట్టుకునే లక్షణాలున్నాయి.

"లింగరాజు ఊరినుంచి వచ్చాడు. అక్కడ నిలబడి చూడటం అతని కార్యక్రమం అయితే, అతనేం చూస్తున్నాడో చూడటం నా కార్యక్రమమైంది."

"ప్రతిసారీ నా అనుమానాలన్నీ స్థిర పరుచుకుని— 'ఆ—దొరికిపోయాడు— ఫలానా వ్యక్తి' అని అనుకోవటం, ఆ ఆలోచన దృఢపడేటంతలో ఏదో జరిగి ఆ వ్యక్తికాకుండా పోవటం, ఎప్పటికప్పుడు ఓడిపోతూ వచ్చాను.

ఓ సమయంలో కాలేజ్ స్టూడెంట్ అనిపించేది. అంతలోనే ఆ అభిప్రాయం ఛిన్నాభిన్నమైపోయేది. మరో సమయంలో సూపర్ బజార్ గర్ల్ అని స్థిరపడబోయేది. అదీ సమసిపోయేది. చివరకు రెండు జళ్ళ అమ్మాయి అని ధ్రువపడటానికి అన్ని హంగులూ సమకూరేటంతలో — అదీ గాలికి కొట్టుకుపోయింది."

"అయితే యీ ముగ్గురిలో ఎవరూ కాదా ?" జగన్నాథం ఆత్రుతగా అడిగాడు.

"కాదు."

కాంతారావు కూడా తెలుసుకోవాలన్న కోరికను అణుచుకోలేకపోతున్నాడు. "మరయితే ఎవరు ?" అని అడగకుండా వుండలేకపోయాడు.


మూడో రౌండ్ పూర్తయింది.

అందరిలో విస్కీ బాగా పని చేయటం మొదలుపెట్టింది.

ఆఖరి రౌండ్—సీసాలోది నలుగురికి వంచేసి పురుషోత్తం అగ్గిపుల్ల అంటించి భగ్గుమనిపించాడు.

బయట తలుపు చప్పుడయింది. గురువులు వెళ్ళి తలుపు తెరిచాడు. హోటల్ బాయ్ గొడుగేసుకుని వాళ్ల ఆర్డర్ చేసినవన్నీ తీసుకొచ్చాడు. పురుషోత్తం తడబడుతూ లేచి తడుముకుంటూ వచ్చి తెరిచి, డబ్బు లెక్కచూసి యిచ్చి పంపేశాడు. గురువులు ఆ ప్యాకెట్లన్నీ ఓ ప్రక్కన సర్దాడు.

"ఎవరు చెప్పు !" జగన్నాధానికి ప్యాకెట్లమీదకన్నా కథమీద ఆకర్షణ ఎక్కువగా వుంది."




"ఆఖరికి...ఆఖరికి...యిహ వుండబట్టలేక లింగరాజును అడిగేశాను."

"ఒప్పుకున్నాడా ! ఎవరో చెప్పేశాడా ?"

"మొదట తెల్లబోయాడు. మన మనసులోని భావాలను — ఎవరయినా థాట్ రీడింగ్‌తో చదివేస్తే ఎలా వుంటుంది ? అలాంటి బాధ కనిపించింది అతని ముఖంలో. ఏమీలేదని బుకాయించాడు. కాదు నిజం ఒప్పుకోమని నేను వాదించాను. చివరకు ఒప్పుకున్నాడుగాని— అదేమిటో చెప్పటానికి నిరాకరించాడు. అంతేకాదు తల్లక్రిందులుగా తపస్సు చేసినా ఆ రహస్యం నేను కనిపెట్టలేనని ఛాలెంజ్ చేశాడు. నాకు పౌరుషం వచ్చింది. కోపం వచ్చింది. కనుక్కొని తీరతానని శపథం చేశాను."

"కనుక్కున్నావా !"

"ఎంతో ఆలోచించాను. ఎంతో టైమ్ వేస్ట్ చేశాను. అతన్ని ఎంతో స్టడీ చేశాను."

"కనుక్కున్నావా అంటున్నాను."

మోహనరావు ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ విస్కీ గబగబ త్రాగుతున్నాడు. మిగతావాళ్ళందరి కళ్ళూ అతని ముఖంవైపే తిరిగి వున్నాయి.

గురువులు ఆగలేకపోతున్నాడు.

బయట వర్షంపడుతూన్న చప్పుడు ఆగకుండా వినిపిస్తూనే వుంది.

అతనేం చెబుతాడోనని చూస్తూ మిగతా ముగ్గురూ విస్కీ కొంచెం, కొంచెం చప్పరిసున్నారు.

నాలుగో రౌండ్ మహత్యం తెలుస్తోంది.

"కనుక్కున్నాను."

"ఎవరు... ? ఎవరు చెప్పు."

"కనుక్కున్నాను. లింగరాజు ముఖం మీద అడిగేశాను — విజయగర్వంతో. అతని ముఖం పాలిపోయింది. పెద్ద షాక్ తిన్నట్టు అయిపోయాడు. నేను ఊహించిన దానికంటే ఎక్కువ దెబ్బ తిన్నట్టు గోచరించాడు."

"అసలింతకీ ఎవరో చెప్పు. త్వరగా చెప్పు."

మోహనరావు వాళ్ళ ప్రశ్న వినిపించుకోవటంలేదు. తనలో తను అనుకుంటున్నట్టుగా అన్నాడు. "అతనలా చేస్తాడని అనుకోలేదు. ఈ ఊరినుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడు."

కాంతారావుకు కోపం వస్తోంది. అతని కళ్లు ఎర్రగా మెరుస్తున్నాయి.

గ్లాసులో వున్నదంతాఒక్క గుక్కలో త్రాగేశాడు.

"ఎవరో చెప్పమంటూంటే..." అని అరిచాడు.

మోహనరావుకు లింగరాజు రూపం కళ్ళెదుట కనిపిస్తోంది. తనేదో అపరాధం చేసినట్లూ, లింగరాజును నలుగురిలో అల్లరిపాలు చేసే స్వవిషయం బయటకు వెల్లడించే హక్కు తనకు లేనట్లూ ఫీలవుతున్నాడు.

"చెప్పను" అన్నాడు వున్నట్టుండి.

"ఎందుకని చెప్పవు?" జగన్నాథం లాలనగా అడిగాడు.

"నాకు చెప్పాలనిపించటంలేదు. చెప్పను."

కాంతారావుకు ముఖం బాగా ఎరుపెక్కింది. "ఇంతవరకూ ఎందుకు చెప్పావు?"

"ఇప్పుడాలోచించుకున్నాను."

"ఇందాక ఆలోచించుకోలేదా?"

మోహనరావు జవాబు చెప్పలేదు.

జగన్నాథం సీటులోంచి లేచాడు. అతని కాళ్లు వొణుకుతున్నాయి. చేతులు వొణుకుతున్నాయి. తూలుతూ నడుసూ మోహనరావు దగ్గరకు వచ్చాడు. "ప్లీజ్" మాటకూడా వొణుకుతోంది. గడ్డంపుచ్చుకుని బ్రతిమాలుతున్నాడు. "మా నాన్నవుగా. బంగారు తండ్రివిగా. చెప్పవూ."

"సారీ!" మోహనరావు లేచి నిల్చున్నాడు. "నే వెడుతున్నాను."

పురుషోత్తం బాధపడ్డాడు. "అదేమిటి? భోజనం..."

"తినాలనిపించటంలేదు. మీరు కానివ్వండి. ఐ టేక్ లీవ్" గుమ్మంవైపు అడుగులు వేశాడు.

"ఆగు!" కాంతారావు కేక హాలంతా మార్మోగింది. యుద్ధంలో యోధుడిలా కసిగా మోహనరావు కేసి నడిచి, అతని కభిముఖంగా నిలిచాడు.

హఠాత్తుగా అతని కాలరు పట్టుకున్నాడు. "యు డర్టీ బాస్టర్డ్, చెప్పకుండా ఎలా కదులుతావో చూస్తాను."

అనుకోని యీ పరిణామానికి అంతా నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

మోహనరావు అతని కళ్ళలో కళ్ళు పెట్టి చూసి బలంగా విదిలించుకున్నాడు.

"వదలను. చెప్పి తీరాల్సిందే" అని కాంతారావు మళ్ళీ చేతులు చాపబోతున్నాడు.

వ్యవహారం ముదురుతోందని గ్రహించి పురుషోత్తం చప్పున లేచి వచ్చాడు. గురువులు అతనికి సాయపడ్డాడు. ఇద్దరూ కలిసి కాంతారావును దూరంగా లాగేసారు.

"సారీ మోహనరావ్." పురుషోత్తం క్షమాపణ కోరుకుంటున్నట్లుగా అడిగాడు.

"దట్సాల్‌రైట్" మోహనరావు వాళ్ళెవరివంకా చూడకుండా చరచర బయటకు వెళ్ళిపోయాడు.

వర్షం యింకా పడుతూనే వుంది. అనేక రకాల భావాలతో మనసు మత్తుగా మొరుగుతోంది. క్షణంపాటు కారు డ్రైవ్ చేయగలనా అని తటపటాయించాడు. అంతలోనే ధైర్యం తెచ్చుకున్నాడు.

ఫియట్ విమానంలా శబ్దంచేసి దూకినట్లు ముందుకు సాగింది. వైపర్స్ పని చేయటం మొదలుపెట్టాయి.

'లింగరాజూ! నన్ను క్షమించు!' అనుకున్నాడు. మనసుకు కంఠం వొస్తే అది గద్గదికమై వుంటుంది.

"నిన్ను నేను ఆరా తీశాననుకున్నాను. అనవసరంగా అల్లరి చేయాలనుకున్నాను."

"నువ్వెవరివి?"

"ఒక మనిషివి."

"నరజాతి చరిత్ర సమస్తం నీలో మూర్తీభవించివున్న మనిషివి. యుగయుగాలనాటి మానవుల మారే నాగరికతలో ఎప్పటికీ మారకుండా చిరస్థాయిగా గుప్త సహజత్వాలన్నీ పుణికిపుచ్చుకున్న మనిషివి. నిన్ను నేను మిగతావారినుంచి ఎడంగాచేసి వేళాకోళం చెయ్యటానికి ప్రయత్నించాను. కాని వారందరూ ముదుసలిగానీ, నడివయసువాడుగానీ, పడుచువాడుగానీ, అప్పుడే యవ్వనంలో అడుగుపెట్టే నూనూగు మీసాల కుర్రవాడుగానీ— అంతా నీలో ఒక భాగమేనని ముందుగా గ్రహించలేకపోయాను."

కళ్ళముందు మసగ మసగ్గా ఏవేవో దృశ్యాలు కదులుతున్నాయి.

"కొత్తగా వెలసిన బస్ స్టాప్."

ఆగే బస్సులు.

అందులోంచి — బస్సు ఆగినప్పుడు, కొంచెం ఎడంగావున్న ఫుట్‌పాత్ మీదకు చేరుకోవటానికి యించుమించు దూకినట్లు అడుగువెయ్యటం.

లింగరాజు నిలబడే స్పాట్.

అక్కడనుంచి చూస్తే ముఖంజోలి అనవసరం, కాళ్ళూ వస్త్రాలూ అక్కర్లేదు, చీరెలూ, అందాలూ అక్కర్లేదు, అలంకారాలూ, సొగసులూ అక్కర్లేదు— అలా దూకినప్పుడు ఏర్పడే కదలికలు, ఏ చిత్రకారుడూ ఎంతకాలం తపసు చేసినా, అందుకోలేనంతటి వైవిధ్యాలని గుమ్మరించే కదలికలు.

కళ్ళముందు మసక మసగ్గా యింకా...

అజంతా శిల్పాలూ, ఆ శిల్పాలలోంచి కొట్టొచ్చినట్లు కనిపించే నిమ్నోన్నతాలూ, శిల్పకారుల ఏకాగ్రతా కేంద్ర బిందువులూ...

కళ్ళముందు లింగరాజు కళ్ళలోని మెరుపు కదులుతోంది.

వర్షానికి తడుస్తోన్న అద్దంమీద వైపర్స్ కదులుతున్నాయి.